# పారిపోయిన కుక్క



అంగర వెంకటకృష్ణారావు

సముద్రంలో కనుచూపుమేర కవళికల సూర్యోదయపు కోమలారుణ రోచిస్సులని జడిసి చరమాచలంపైకి నిర్గమిస్తున్నాయి చీకట్లు. ప్రభాతసమీరాలు తాజాగా వీస్తున్నాయి.

ఇసకనేల విడిచి రోడ్డెక్కి పదిగజాలు నడిచానో లేదో అదృశ్యం కంటపడింది.

పిచికలు పీకిన జుట్టు, పెరిగిన గడ్డం, లొత్తల బుగ్గలు, పిండి జల్లినట్టున్న కళ్లు, జీర్ణవస్త్రాలు, ఒకకాలు సొట్ట-చంకలక్రింద ఊతకఱ్ఱలు - అస్థిపంజరం!

ఎడమచేతిలో ఒక చిప్ప-ఆ చేత్తోనే పెనచి పట్టుకొన్నాడు కుక్కకు కట్టిన త్రాడు.

దగ్గరగా వెళ్ళాను, ఆదేమిటో వింతగా తోచి.

కుక్క పెనుగులాడుతూంది. అతడు యాంత్రి గిలబడుతూ కంట నీరుపెట్టుకుని, కుడిచేత్తో దువ్వుతున్నట్టు సంజ్ఞలు చేస్తూ బ్రతిమాలుతున్నాడు. అతడు బ్రతిమాలినప్పుడల్లా ఆ కుక్క మరీ గింజుకుని, తాడు తెంచి పారిపోవడానికి తీవ్రయత్నం సాగిస్తూంది. అతను చెమటలు కక్కుతున్నాడు.

నేను మరీ దగ్గరగా వెళ్ళాను.

'నన్ను విడిచిపెట్టకే! నామాట విను-నువ్వు లేకపోతే నే నుండలేను!'

నాకు జాలి వేసింది.

'ఒక్క నిమిషమున్నా వుండను' తెగ గింజుకుంది-వణికిపోయాడు వాడు.

హడలిపోయాను నేను! మాట్లాడింది-కుక్క!! ఆ ముష్టివాడి గజ్జికుక్క!

వాడితో అన్నాను-'ఏమిటోయ్! ఈ కుక్క నిన్ను విడిచి ఎందుకు వెళ్ళిపోతా నంటుంది' అని. వాడు జవాబు చెప్పబోయ్యేలోగా కుక్క నా వేపు చురచుర చూసి, 'నీకెందుకు మా గోల-పో, అవతలకి' అని అరిచింది. నాకు సిగ్గు వెయ్యలేదు. ఆ కుక్క యజమానిని చూడగానే నా హృదయంలో మానవ సహజమయిన జాలి నిండి తొణికిసలాడింది; మరి యే యితర సానుభూతికి చోటు లేకపోయింది.

పారిపోతూన్న ధైర్యాన్ని కూడగట్టుకుని కుక్కని అడిగాను, 'దయచేసి చెప్పుదూ, యితడినెందుకు విడిచిపెడుతున్నావో' అని.

'నువ్వు వేసిన ప్రశ్నకు అంత సంక్షిప్తంగా జవాబు చెప్పడం కష్టం——కాని చెబుతా !'

అప్పుడు ముష్టివాడి కళ్ళంట జడివాన కురుస్తోంది.

'మానవప్రవృత్తి [illegible] చేసినందువల్ల ప్రయోజనం లేదని నిన్న రాత్రి హఠాత్తుగా గ్రహించాను'.

'విశ్వాసానికి పేరుపడ్డ జాతికదా నీది-ఇప్పుడింత అవిశ్వాసంగా ఎందుకు ప్రవర్తించబోతున్నావ్?'

'చెబుతున్నా - తొందరపడకు' కుక్క కూచుంది.

'మేం తరతరాలుగా వీళ్ళ కుటుంబానికి సేవ చేస్తూన్నాం. మా అమ్మ నేటికి ఏడాది క్రిందటి వరకూ యితని తండ్రికి సకల సపర్యలూ చేస్తూండేది.'

ముష్టివాడు కళ్లు తుడుచుకుంటూ అన్నాడు-'పిల్లమ్మ మా తండ్రికి పదియేళ్లకు పైగా సేవ చేసింది. ఇద్దరూ నిరుడు ఏకకాలమందే చచ్చిపోయారు'.

మాట నొక్కితే స్ప్రింగు తన్నినట్టు కుక్క లేచి గుడ్లు పెద్దవిచేసి నావేపు వురిమింది.

మానవసామాజికుడిని శునకసామాజికురాలం ఎదిరిస్తూంది.

'నువ్వలా తొందరపడకు- మామీద కోపపడి కుంటివాడైన నీ యజమానిని ఎందుకు విడిచిపెడతావు, పాపం.'

'ఎందుకా! చేసిన సేవకి ఫలితం వుండాలి. చేసినవాళ్లకికాదు- కసిరం చేయించుకున్న వాళ్లకి. తరతరాలుగా వీళ్ళనికని పెట్టుకొనివుండి వీళ్ళచరిత్ర కని పెడుతూన్నా—వీళ్ల పితామహ ప్రపితామహుల దగ్గరనుంచీ ముష్టివాళ్లే- వీళ్ల చిరనివాసమయిన అంబటిసత్రవుని వర్ణించడానికి, చివరకి ఎన్ని అబద్ధాలైనా వ్రాయడానికి జంకని ఏ కవీ కూడా పూనుకోలేదు— నిశ్వాసాలు, బరువైన ఉచ్ఛ్వాసాలు. యాతనాజనితహృదయ విదారకాక్రందనాలు, శీర్ణదేహాలు, నిత్యాంధకార భవితవ్య జీవనాలు మొదలైనవాటితో ప్రత్యక్ష నరకంగా వున్న వీళ్ల అజ్ఞాతనివాసాన్ని బాగు చెయ్యడానికి ఏమానవుడు తలపెడతాడు!'

'కుక్కా, నువ్వు చాలా తొందరపడిపోతున్నావు! మానవుడిప్పుడే సంస్కార కార్యంలోకి దిగేడు- అతడికి కొంత వ్యవధి కావాలి!'

'వ్యవధి కావాలా! దబాయించకు. ఈవూళ్లో ఒక ఈశ్వరాలయం వుంది. దాన్ని తొమ్మిది వందల ఏళ్లక్రిందట మరాటీదండు వచ్చి శిథిలపరిచింది. దాని పునరుద్ధారణకి నేడు రెండు లక్షలు ఖర్చుపెడతారట! దానికింత తొందరేం?'

'మనదేశం కళలకు నిలయం. ఆ దేవాలయంలో గొప్ప శిల్పం వుండేది. దాని శైథిల్యాలే నేడు పునరుజ్జీవింపచెయ్యబడుతున్నాయి.'

కుక్క అపహాస్యంగా నవ్వింది- 'ఓయి వెర్రివాడా! తొమ్మిదివందలేళ్లక్రిందట విరిగిన రాతిబొమ్మ అతకడానికి యిప్పుడే మంత తొందర, అవసరం కలిగాయి! చూడు, నా యజమాని వైపు. ఈగడ్డలో కర్మపడానికి తొలివ్యాఖ్య వ్రాయబడిననాటినుంచి నేటివరకూయితడు శిథిలలాగానే వున్నాడు- ఇతడి వునికి అయిన అంబటి సత్రవు నిత్యశిథిలావస్థ అనుభవిస్తూంది. ఆ దేవాలయంలో నిర్జీవ ప్రాణాలున్నాయి. ఈ దుఃఖాలయంలో కవోష్ణరుధిరం స్రవిస్తూన్న హృదయాలున్నాయ్! ఈ విషయం గ్రహించలేకపోవడానికి కారణం నీలో హృదయం లేకపోవడమే!'

నే నేమంటాను? శ్రుతి మించిపోయింది. కాని కరిస్తే కరిచింది - ఇంతకీ పిచ్చికుక్క కాదని తిరిగి ధైర్యం తెచ్చుకున్నాను.

'ఢిల్లీలో ఒక్క భిక్షువు లేదు తెలుసా!'

బోర విరుచుకు నవ్వాను.

'కానట. ఉండలేక పారిపోయి వుంటారు. పక్షుల్లా ఎగిరేవాళ్ళకోసం కేటాయించబడ్డ నగరంలో గాలికి ధూళికి పెరిగేవాళ్లలా మనగలుగుతారు' అని ఒక్కసారి గుంజుకుంది పారిపోవాలని. ముష్టివాడు కదిలిపోయాడు- సొట్ట కాలుతో సొట్ట కాకిలా గెంతాడు.

'ఉండుండు! నా ఆఖరు వుపదేశం విను'— కుక్క నిల్చింది.

'ఈ వూళ్లో చాలా ధనవంతు లున్నారు— ఉదారసమాజా లున్నాయి, వాళ్లెవరికైనా ఎప్పటికైనా బుద్ధి పుడుతుంది. వీళ్ళంతా నరక ముక్తి పొందుతారు. తొందరపడి యీ నిస్సహాయ విహంగజీవిని పరిత్యజించకు'-నా హృదయం రోదించింది.

'పిచ్చివాడా! మా అమ్మ చెప్పేది: పదిహేనేళ్ళక్రితం ఈ వూళ్లో పదిహేను మేడలు మాత్రం వుండేవి. ఊరు పొడుగు సుమా రొక మైలు- వెడల్పు లేదనే చెప్పాలి. ఏమంటే ఒక వైపు సముద్రం, ఒకవైపు కొండ. ఇప్పుడో! సుమారు రెండులక్షల ప్రజ ఉన్నారు. పూర్వం దయ్యాలు తాండవించే ప్రదేశాలలోకూడా సినీమా భవనాలు, మేడలు, మోటారుకారులు! ఆ రోజులలో యీ వూరంతటికీ 'పొట్ట' గలవాడు మిఠాయి అమ్మే బొండిలీ బాబా ఒక్కడే నట. కాని అతడి కాపొట్ట ప్రకృతిప్రసాదితం. నేడో! 'పేదల రక్తమాంసముల పెంపువహించిన' గూనల్లాంటి, బానల్లాంటి పొట్టలు ఎన్ని వేలో తిరుగుతున్నాయి. కాని అప్పటికీ, యిప్పటికీ మారనిది అంబటి సత్రవు. మరీ శిథిలమైపోయినవాడు నా యజమాని-అందుకే నేనుండను' అని మళ్లీ గుంజాయించింది.

'అయ్యయ్యో-ఇన్ని తెలిసినదానివి నువ్వు యింత తొందరపడితే ఎలా.....'

'తొందర కాదు-మానవులతో కూడుకొన్న యీ అనాగరక విపినజీవితం ముగించి-జంతువులతో కూడిన నాగరక ప్రపంచంలోకి వెళ్ళిపోతున్నాను. అది ఆ కనుపించే కొండ కవతల వుంది. అప్పుడప్పుడు కొండెక్కి చూస్తుంటాలే. నరభుక్కుల పొట్టలు- మానవమృత్యువుల కంటె పొరలు పోయాక తిరిగివస్తా అంబటి సత్రవులోకి, కాదు-అధికారంలోకి.' కుక్క చటుక్కున తొడ కొరికి అదే పరుగు. ముష్టివాడు వెల్లకిలా పడ్డాడు.